క్లుప్తంగా

సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు



మండవల్లి: స్థానిక శ్రీ దత్త పరంపర షిరిడీ సాయిబాబా మందిరం 14వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా ఆదివారం బాబావారికి పంచామృతాలతో అభిషేకాలు, విశేష అలంకరణ నిర్వహించారు. అనంతరం స్థానిక షిర్డీ సాయిబాబా భక్తబృందం సాయినామ సంకీర్తన చేశారు. సాయంత్రం శ్రీ పాద శ్రీ వల్లభస్వామికి ప్రీతికరమైన సిద్ధ మంగళ స్తోత్రం 108 సార్లు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, యిన్నా వెంకటేశ్వరరావు, పెరుమాళ్ళ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు మాజీ మంత్రి కొడాలి నాని శుభాకాంక్షలు

గుడివాడ టౌన్: నియోజకవర్గ ముస్లింలు బక్రీద్ పర్వదినం వేడుకలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మాజీ మంత్రి, గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అల్లా దయతో నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆయన చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నామన్నారు.

ఘనంగా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



గుడివాడ టౌన్: స్థానిక జగన్నాధపురం పాటిమీద వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. స్వామి వారికి అభిషేకాలు గావించి పెండ్లి కుమారునిగా అలంకరించారు. బుధవారం సాయంత్రం 7.30 గంటలకు స్వామి వారి తిరుకల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేదాంతం అప్పలాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

కళాభివృద్ధికి కృషిచేద్దాం



గుడివాడ టౌన్: స్పందన ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ గుడివాడ ఆధ్వర్యంలో కళాభివృద్ధికి కృషిచేద్దామని అసోసియేషన్ అధ్యక్షుడు జి. బాబూశ్రీకర్ అన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని జీవీ పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాల్లో ఆదివారం అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి సందేశాలు పంపే విధంగా కొత్త కొత్త రచనలను ఆధారంగా తీసుకుని నాటకాలు, ఇతర ప్రదర్శనల ద్వారా కళలను పోషిద్దామని తెలిపారు. అందుకు సభ్యులు సహకరించాలని కోరారు. ప్రత్యేకించి హాస్య కథనాలపై దృష్టి పెట్టాలని అప్పుడే అవి ప్రజలకు చేరతాయన్నారు. నూతనంగా అసోసియేషన్‌లో చేరిన సభ్యుల సేవలు పూర్తిగా వినియోగించుకుంటామని పేర్కొన్నారు. కళాప్రోత్సాహంలో ఎవరు సూచనలు ఇచ్చినా స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వల్లూరుపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కార్యదర్శి నరహరశెట్టి ప్రసాదు, కో–ఆర్డినేటర్ డాక్టర్ శర్మ, కోశాధికారి కొనకళ్ల సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండలమ్మకు మొక్కుబడుల సమర్పణ

గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలైనుల్లో భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్ తగు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా లక్షమల్లెలార్చన

తుంగలవారిపాలెం(అవనిగడ్డ): మండల పరిధిలోని తుంగలవారి పాలెంలో ప్రసన్నాంజనేయస్వామికి లక్ష మల్లెలార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జ్యేష్ఠ శుద్ధ దశమిని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళి స్వామి వారికి విశిష్ట అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భోగిరెడ్డి నరసింహారావు–ప్రియాంక వివాహ మహోత్సవం సందర్భంగా ఆయన సోదరుడు భోగిరెడ్డి రామాంజనేయులు ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

రైతన్నలూ.. విత్తనాలు కొంటున్నారా ?

ఈ జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న అధికారులు

- విత్తన చట్టాలపై అవగాహన అవసరం
- లైసెన్స్ ఉంటేనే ప్రైవేటుగా విత్తనాల విక్రయం
- విత్తనాలు కొంటే రశీదు తప్పనిసరి



పామర్రులో విత్తనాలు అమ్మకం చేసే ఓ దుకాణం

పామర్రు: ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు విత్తనాలను సేకరించే పనులలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో మొత్తం 80 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ప్రస్తుతం సాగులో దమ్ము పనులు చేస్తున్నారు. ప్రైవేటు దుకాణాల్లో విత్తనాల విక్రయాలు జోరందుకున్నాయి. క్రయవిక్రయాలు అధికంగా జరిగే ఈ సీజన్‌లో రైతులు మోసపోయే అవకాశాలు కూడా ఉన్నాయి. విత్తన చట్టంపై అవగాహన పెంచుకుంటే ఇలాంటి అవస్థలు ఉండవని నిపుణులు సూచిస్తున్నారు. ఈ చట్టం ద్వారా విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా సంబంధిత విత్తనాల డీలర్లపై కఠినమైన చర్యలు తీసుకుంటారు. విత్తన చట్టం 1966, విత్తన నిబంధనలు 1968, విత్తన నియంత్రణ ఉత్తర్వులు 1983 తదితర చట్టాలు పొందుపరిచి విత్తన పరమైన అతిక్రమణలు, ఉల్లంఘనలు వర్తించే విధంగా ఈ చట్టాన్ని రూపొందించారు. విత్తన విక్రయాల్లో మోసాలకు పాల్పడిన వారిపై విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు 3 ప్రకారం ఆయా దుకాణాల్లో విత్తనాలను జప్తు చేయడంతో పాటు అత్యవసర సరుకుల చట్టం 1955 సెక్షన్ ఏ ప్రకారం జరిమానా కూడా విధిస్తారు. జిల్లాలో సుమారు 417 ప్రైవేట్ దుకాణాలు ఉన్నాయి. 121 మంది విత్తనాల విక్రయాల డీలర్లు, 165 మంది ఎరువుల విక్రయాల డీలర్లు, 131 మంది పురుగుమందుల విక్రయాల డీలర్లు ఉన్నారు.

స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలి....

విత్తనాలు విక్రయించే దుకాణాల్లో కచ్చితంగా ధరలు, స్టాకు బోర్డులను ఏర్పాటు చేయాలి. అలా లేకుంటే విత్తన నియంత్రణ ఉత్తర్వుల–1989 క్లాజు 8 ప్రకారం ఆయా దుకాణాల్లో విత్తనాల అమ్మకాలు నిలుపుదల చేస్తారు. అంతేకాకుండా అధికారులు ఇచ్చిన నోటీసులకు సరైన సమాధానం ఇవ్వకపోతే లైసెన్సు రద్దు చేస్తారు.

లేబుల్ లేకపోతే....

ప్రైవేట్ విత్తనాల అమ్మకం దారుడి వద్ద కొనుగోలు చేసిన విత్తనాల బస్తాలకు లేబుల్ లేకపోతే విత్తన చట్టం–1966 సెక్షన్ 7 ప్రకారం చర్యలు చేపట్టవచ్చు. ఆయా విత్తనాలను జప్తు చేసే అధికారం ఉంది. అత్యవసర సరుకుల చట్టం–1955 సెక్షన్ ప్రకారం జరిమానా విధిస్తారు. కాలం చెల్లిన విత్తనాలు అమ్మకాలు చేస్తే విత్తన చట్టం –1966 సెక్షన్ 7 ప్రకారం విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు 8 నుఅనుసరిస్తూ డీలర్ లైసెన్సు సస్పెండ్, రద్దు చేయవచ్చు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు ఆయా దుకాణదారుడు కచ్చితంగా రశీదు ఇవ్వాలి. రశీదు ఇవ్వని పక్షంలో విత్తన నియంత్రణ ఉత్తర్వులు –1983 క్లాజు 9 ప్రకారం ఆయా దుకాణదారునికి ముందుగా నోటీసు జారీ చేసి దానికి సరైన సమాధానం ఇవ్వకపోతే ఆయా డీలర్ లైసెన్స్‌ను సస్పెండ్, రద్దు చేయవచ్చు.

లైసెన్సు ప్రదర్శన తప్పనిసరి

ప్రైవేట్ విత్తనాల విక్రయ దుకాణాల్లో తప్పనిసరిగా విత్తన లైసెన్సును ప్రదర్శించాలి. అలా లేకుంటే ఆ దుకాణంలో విత్తనాల విక్రయాలను నిలిపివేయవచ్చు. అంతే కాక నోటీసు ఇస్తూ దానికి సరైన సమాధానం ఇవ్వక పోతే విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు 5 ప్రకారం డీలర్ లైసెన్సు సస్పెండ్, రద్దు చేయవచ్చు.

నిబంధనలు పాటించాల్సిందే



ప్రభుత్వం పొందు పరచిన విత్తన చట్టానికి అనుగుణంగా ప్రైవేట్ విత్తనాల డీలర్లు విత్తనాలను విక్రయించాలి. ఈ విషయంలో ఆయా డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే భారీగా జరిమానాతో పాటు దుకాణాల లైసెన్సును పోగొట్టుకునే పరిస్థితి ఉంటుంది.

– స్వర్ణలత, ఏడీఏ పామర్రు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



పామర్రు ఎమ్మెల్యే దంపతులను గజమాలలతో సన్మానిస్తున్న పెరిశేపల్లి గ్రామస్తులు

పెరిశేపల్లి(పామర్రు): నియోజకవర్గ అభివృద్ధికి తన వంతుగా నిరంతరం కృషి చేస్తానని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. పెరిశేపల్లి గ్రామంలోని కళ్యాణ మండపంలో విజయోత్సవ సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనను గెలిపించి చట్టసభకు పంపించిన ప్రజల మనస్సులను గెలిచి వారికి అన్ని విధాలా అండగా ఉంటానని తెలిపారు. దశాబ్దాలుగా టీడీపీ గెలుపు కష్టం అనుకునే నియోజకవర్గంలో ఈ స్థాయి మెజార్టీని ఇచ్చిన నియోజకవర్గ ప్రజలకు ఏమిచ్చి రుణం తీర్చుకోగలనని అన్నారు. గతంలో నిర్వహించిన పాదయాత్రలో నియోజకవర్గంలోని సమస్యలను చూశానని, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని తెలుసుకున్నానన్నారు. ఈ సమస్యలు అన్ని పరిష్కారం చేసి మోడల్ నియోజకవర్గంగా మారుస్తానని చెప్పారు. నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మారుస్తానని తెలిపారు. అనంతరం స్థానికులు అందరూ కలిసి వర్లకుమార్ రాజా దంపతులను గజ మాలలతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్లరామయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, పార్టీ నాయకులు కుదరవల్లి ప్రవీణ్‌కుమార్, వల్లూరి పల్లి గణేష్, గొట్టిపాటి లక్ష్మీదాసు, జి.వెంకటేశ్వరరావు, చాపరాల వెంకటరమణ, బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

కాలువలు ఇలా.. సాగునీరు పారేదెలా ?



తోట్లవల్లూరు వద్ద అధ్వానంగా మారిన బందరుకాలువ



గుర్రపుడెక్కతో నిండిపోయిన చిల్లడొంక పంటకాలువ

తోట్లవల్లూరు: గుర్రపుడెక్క, తూటుకాడతో సాగునీటి కాలువలు అధ్వానంగా మారాయి. ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నా గుర్రపుడెక్క తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోకపోవటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ప్రధానంగా ప్రవహించే బందరుకాలువ, దానికి అనుబంధంగా ఉన్న పంటకాలువలు గుర్రపుడెక్క, తూటుకాడతో అల్లుకుపోయాయి. కాలువలు అధ్వానంగా ఉండటంతో సాగునీరు సరఫరా ఎలా సాధ్యపడుతుందని రైతులు అంటున్నారు. అధికారులు స్పందించి కాలువలలో గుర్రపుడెక్క, తూటుకాడ తొలగించి సాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

124 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యబృందం

గుడివాడ టౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. చిన అవుటపల్లికి చెందిన పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్య బృందంచే గుండె, నరాలు, ఎముకలకు సంబంధించిన వ్యాధులతో పాటు జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 124 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ క్యాంప్ కన్వీనర్ సి. సూర్యచంద్రరావు, జి.కిరణ్ బాబు, రోటరీక్లబ్ అధ్యక్షుడు రమణమూర్తి, వైద్యులు డాక్టర్ ఎంవీ మాధవ్, డాక్టర్ పి. దివ్య సాయిరామ్, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ బి. అజిత, డాక్టర్ కె. శ్రీ రూపాతేజస్వి తదితరులు పాల్గొన్నారు.

చినపులిపాకలో ఎడ్ల పోటీలు ప్రారంభం



చినపులిపాకలో ఎడ్ల పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

తోట్లవల్లూరు: గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని చినపులిపాకలో ఏర్పాటు చేసిన ఎడ్ల పందేలను ఆదివారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. చినపులిపాకలో ఎడ్ల పోటీలు ఏర్పాటు చేయటం అభినందనీయమని తెలిపారు. పోటీలను పండుగ వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్, బొడ్డపాడు సర్పంచ్ మూడే శివశంకర్, రెడ్డి ఏడుకొండలు, మార్గాని కోటేశ్వరరావు, బీరం చినబాబు, ధర్మారావు తిరుపతయ్య, లోకేష్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడండి



గుడివాడ టౌన్: పట్టణంలో ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం విద్యుత్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని శివారు ప్రాంతాలలో అవసరమైన వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో ఎక్కడా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా కృషి చేయాలని కోరారు. విద్యుత్ లైన్‌ల విస్తరణకు అవసరమైన నివేదిక త్వరలో అందజేస్తే దాని పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఈఈ, ఏడీఈలు, ఏఈలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోవధ చేస్తే కఠిన చర్యలు

గూడూరు: మండలంలో గోవధ నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని గూడూరు ఎస్ఐ ఐ.వీర్రాజు స్పష్టం చేశారు. ఆదివారం గూడూరు పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. కోర్టు ఆదేశాల మేరకు గోవధపై ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. దీనిని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మసలు కోవాలని ఆయన తెలిపారు.

సుబ్బారాయుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు



స్వామివారి పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామివారి పుట్టలో పాలు పోయడం మొదలు పాలపొంగళ్లశాల వద్ద నైవేద్యాలు తయారుచేసేందుకు సైతం భక్తులు పోటీ పడ్డారు. పలువురు మహిళా భక్తులు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. జిల్లాలోని నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో స్వామిని దర్శించుకునేందుకు అధిక సమయం క్యూలో వేచి ఉండాల్సి వచ్చింది. నాగబంధాల వద్ద, గోశాల వద్ద మహిళలు భారీ ఎత్తున పూజలు చేశారు. ఇందుకు అనుగుణంగా సహాయ కమిషనర్ నేల సంధ్య చొరవతో ఆలయ కళామండపంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు ప్రసాదపు కౌంటర్లను ఏర్పాటుచేశారు.

ప్రమాదభరితంగా వంతెన



అయ్యవారిరుద్రవరం వంతెన

మండవల్లి: మండలంలోని అయ్యవారిరుద్రవరంలో కాలువపై నిర్మించిన వంతెన ప్రమాదభరితంగా మారింది. దీనిపై మండవల్లి, చిగురుకోట, అయ్యవారిరుద్రవరం, తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. వంతెనపై భాగంలో రెండు చోట్ల రేకు దెబ్బతిని రంధ్రాలు ఏర్పడ్డాయి. అలాగే వంతెన అడుగుభాగం కూడా దెబ్బతింది. వంతెన పైన ఉన్న రంధ్రంలోకి వాహనాలు వెళితే పల్టీ కొట్టే ప్ర మాదం పొంచి ఉంది. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వంతెనను అభివృద్ధి చేయా లని గ్రామస్తులు బోయిన ఈశ్వర్, పరసా పెంటయ్య, పరసా ప్రకాష్, ఇంటి రాజు కోరుతున్నారు.

ఆటో ఫైనాన్షియర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా, అసోసియేషన్ ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ అసోసియేషన్ సభ్యులకు అండగా ఉండటమే కాకుండా తమ సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కృష్ణా జిల్లా ఆటో ఫైనాన్షియర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.జయప్రకాష్ నారాయణ తెలిపారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లో ఉన్న ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) హాలులో కృష్ణా డిస్ట్రిక్ట్ ఆటో ఫైనాన్షియర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ.. 1974వ సంవత్సరంలో తమ అసోసియేషన్ ఏర్పాటు చేశామని ఆనాటి నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తమ అసోసియేషన్ ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా ఈ మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు, మందులను ఉచితంగా అందజేశామన్నారు. ఈ నెల 22వ తేదీన నగరంలోని ఫార్చ్యూన్ మురళీ హోటల్‌లో తమ అసోసియేషన్ స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించనున్నామని, ఈ వేడులకు అసోసియేషన్ జాతీయస్థాయి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. అసోసియేషన్ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ కమిటీ చైర్మన్ వీజీకే ప్రసాద్‌తో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు. 400 మందికి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ శిబిరాన్ని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమా ప్రారంభించారు.

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు

గుడివాడ టౌన్: త్యాగాలకు ప్రతీక అయిన బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా నిర్వహించుకోవాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లా దీవెనలు ప్రజలపై ఉండాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు. ఆనందోత్సాహాలతో బక్రీదు నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

గుడివాడ టౌన్: విద్యాభివృద్ధికి నూతన ప్రభుత్వం కృషిచేస్తే తమ సహకారం అన్నివేళలా ఉంటుందని ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. సాయి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎస్‌టీయూ కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఉద్యోగులుగా ఏ ప్రభుత్వంపైనా తాము శత్రుత్వం పెంచుకోబోమని తెలిపారు. తాము ఉద్యమాలు, పోరాటాలు, సమస్యల పరిష్కారంపైనే దృష్టిపెడతామని చెప్పారు. సానుకూలంగా వ్యవహరిస్తే పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ కృష్ణాజిల్లా శాఖ కార్యదర్శులు పి. ఇమ్మానుయేల్, డి. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వయోవృద్ధ ట్రస్ట్ సేవలు నిరుపమానం



వృద్ధులకు సరుకులు అందజేస్తున్న శివశంకర్‌రావు తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరి జీవితంలోను వృద్ధాప్యం అనేది ఒక భాగమని, వృద్ధులను ఆదరించటం కనీస బాధ్యతగా భావించాలని ప్రభుత్వ ఆస్పత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివశంకర్‌రావు సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం సాయంత్రం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన లేఖ్‌రాజ్జీ సోలంకీ జ్ఞాపకార్థం దాతల సహకారంతో వృద్ధులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వృద్ధులకు దాతలతో కలిసి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 204 నెలలుగా ప్రతి నెలా నిరుపేద వృద్ధులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు అందజేయటంతో పాటు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయటం అభినందనీయమన్నారు. ట్రస్ట్‌కు అవసరమైన సహకారం అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ మాట్లాడుతూ.. తాము చేపట్టిన ప్రతి సేవా కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. రాబోయే రోజులలో సేవలు మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. దాతలు కీర్తికుమార్ జైన్, అనిల్‌కుమార్ జైన్, నరేంద్ర కుమార్ జైన్, ట్రస్టీలు తట్టి అర్జునరావు, పి.లక్ష్మీనరసింహారావు, వెంకటేష్ గోదావరి పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించండి



గుడివాడ టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ కుళాయిలలో మురుగు నీరు వస్తుందని స్థానికులు అంటున్నారు. ఆదివారం స్థానిక సత్యనారాయణపురంలో కుళాయిల ద్వారా వచ్చిన కలుషిత నీటిని ప్రజలు మీడియాకు ప్రదర్శించారు. పరిశుభ్రమైన నీటిని అందించాలని శుక్రవారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులతో సమీక్ష నిర్వహించగా ఆదివారం ఈ విధమైన కలుషిత నీరు రావడంపట్ల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సాగర తీరంలో పర్యాటకుల కోలాహలం

కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పర్యాటకుల సందడితో కళకళలాడింది. ఆది, సోమవారాలు వరుస సెలవులు నేపథ్యంలో తీరానికి యాత్రికులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తీరంలో అందాలను ఆస్వాదించి సరాదాగా గడిపారు. యువకులు బీచ్ కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ ఆటలతో సందడి చేశారు. చిన్నారులు ఇసుకతిన్నెలపై తమ పేర్లు రాసుకొని మురిసిపోయారు. తీరంలో సరైన వసతులు లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అటవీ అధికారుల ఆంక్షలతో తీరం వెంట చిరువ్యాపారాలను కూడా నిలిపివేయడంతో సాగరతీరంలో కనీసం తాగునీరు కూడా దొరక్క యాత్రికులు తాగునీటికోసం అలమట్టించారు.

శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో అగ్నిప్రతిష్టాపన

పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామివారి ఆలయంలో 20వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ఆలయంలో అగ్ని ప్రతిష్టాపన చేశారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, యాగశాల ప్రవేశం, ఉదయం 10 గంటలకు అగ్నిప్రతిష్టాపన జరిగింది. సాయంత్రం ఐదు గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, శేషవాహన సేవ నిర్వహించారు. కాగా సోమవారం శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామివారి పర్యవేక్షణలో పంచామృత స్నపన, అష్టోత్తర శత కలశ స్నపన, 108 కలశాలతో అభిషేకం నిర్వహించనున్నారు. భక్తులు ఈ పూజా కార్యక్రమానికి హాజరుకావాలని ఆలయ అభివృద్ధి కమిటీ కోరింది.